ముువ్వన్నెల జెండా రెపరెపలు

ఘనంగా గణతంత్ర వేడుకలు

ఆరిలోవ: ముువ్వన్నెల జెండా రెపరెపలాడింది. తూర్పు నియోజకవర్గంలో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో జాతీయ జెండాను ఎగుర వేసి వందనం చేశారు.

• విశాఖ కేంద్ర కారాగారంలో జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పరేడ్ మైదానంలో జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, అధికారులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పిల్లలు, ఖైదీలకు మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరామచంద్రరావు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

• విమ్స్‌లో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు జెండా ఆవిష్కరణ చేశారు. ఉత్తమ వైద్య సేవలు అందించిన వారిని గుర్తించి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విమ్స్ ఆర్ఎంవోలు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ కృష్ణప్రియ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


విశాఖ కేంద్ర కారాగారంలో ఉద్యోగుల పిల్లలకు చాక్లెట్లు అందిస్తున్న ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు


జాతీయ పతాకంతో కృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థుల విన్యాసం


బంగ్లాలో పతాకావిష్కరణ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

• విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. విద్యార్థులు ఆలపించిన దేశ భక్తి గీతాలు అలరించాయి.

• పైనాపిల్ కాలనీలోని జిల్లా మహిళా ప్రాంగణంలో మాతా శిశు సంక్షేమ విభాగం రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) చిన్మయిదేవి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల, సిబ్బంది పాల్గొన్నారు.

• జీవీఎంసీ 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్ స్మార్ట్ సిటీ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి రవీంద్ర, జాయింట్ సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు.

• విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు.

• శ్రీకృష్ణపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ జెండా ఆవిష్కరణ చేశారు.

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు జెండాను ఆవిష్కరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వందన సమర్పణ చేశారు. అనంతరం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు ఆకట్టుకుంది. వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సుజాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ బి.సన్యాసిరావు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు అద్భుత విన్యాసాలతో ఆకట్టుకున్నారు.

ఎంవీపీ కాలనీ: లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.


బీజేపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్, తదితరులు

• ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాజారావు, విభాగ అధికారి వీవీ పతిరావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

• పెదవాల్తేర్ గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బోర దాసురెడ్డి, కార్యదర్శి దల్లి అప్పలరెడ్డి, కోశాధికారి పలికిల పైడితల్లి రెడ్డి, తదితరులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

• విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ సెక్టార్–6 రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కులో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ వేడుకల్లో సంఘం కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు రాము, తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెదవాల్తేర్ గ్రామ సంఘం ప్రతినిధులు

• 19వ వార్డు వాసవానిపాలెంలోని జీవీఎంసీ మత్స్యకార పాఠశాలలో లయన్స్ క్లబ్ ద్వారకానగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుల్లో క్లబ్ ఉపాధ్యక్షుడు జీబీ కుమార్, జోన్ చైర్మన్ పేర్ల భాస్కరరావు, పాఠశాల హెచ్ఎం సత్యవేణి పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో..

మహారాణిపేట: కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం కలెక్టర్ బంగ్లాలో జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంల ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వారికి మిఠాయిలు పంపిణీ చేశారు.

వీఎంఆర్డీఏ కార్యాలయంలో..

దొండపర్తి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో మెట్రోపాలిటన్ కమిషనర్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జాతీయ జెండాను ఎగరవేశారు. ముందుగా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి వేణుగోపాల్, చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రభాకరరావు, చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాదరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ఎస్ఈ భవానిశంకర్, ఈఈ బలరాం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మహిళా ప్రాంగణంలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

ఏయూ క్యాంపస్: గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో జాతీయ పతాకాన్ని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి డి.వి.ఎస్.కామేశ్వర రావు ఎగురవేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మధురవాణి పాల్గొన్నారు.


కేడీపీఎం స్కూల్‌లో జెండా వందనం చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మి


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు


విమ్స్‌లో జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు


విశాఖ వేలీ స్కూల్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్


కైలాసగిరిలో ఏఆర్ పోలీస్ మైదానంలో జెండా ఆవిష్కరిస్తున్న ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు

క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువతీ యువకులు

బీచ్‌రోడ్డు: ప్లాస్టిక్ నిషేధిద్దాం–పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ యువతీ యువకులు నినదించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గో బడ్డీ యాప్ ఆధ్వర్యంలో గురువారం బీచ్ రోడ్డులోని ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. గుడ్డ సంచులను వినియోగిద్దామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా 50 వేలు ప్లాస్టిక్ నిషేధిత పోస్టర్లను జీవీఎంసీ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాయర్లు పలక శ్రీరామమూర్తి, అహ్మద్, రాజు, గో బడ్డి యాప్ ప్రతినిధులు శివకుమార్, నర్సింగరావు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాస్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా గురువారం పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీహరినగర్‌లో ఆ పార్టీ కార్యకర్తలతో కలసి పేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఆరిలోవ అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు పెదగదిలిలోని శ్రీనివాస్ నివాసం వద్ద కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జీవీఎంసీ సీఈ కృష్ణంరాజు, ఏడీసీలు సన్యాసిరావు, శ్రీనివాస్, సీసీపీ సురేష్, కార్యదర్శి నల్లనయ్య, జెడ్సీ కనకమహలక్ష్మి తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మికి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు తరించారు.


తులసి పూజలందుకున్న కనకమహాలక్ష్మి

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

మల్కాపురం : 58వ వార్డు పిలకవానిపాలెం మలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం ఓ వైపునకు ఒరిగిపోయింది. ఘటనలో మరో రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. పిలకవానిపాలెం సమీపాన గల నార్త్ ఇండియన్ ఒకరు గురువారం తెల్లవారుజామున తన స్నేహితుడి కారులో ఓ శుభకార్యానికి బయలుదేరారు. పిలకవానిపాలెం మలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం పక్కన పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


బీవీకే పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు


సోలార్ విద్యుత్ దీపాలు, ముగ్గుల అలంకరణలో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్

ఆరిలోవ: విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో గురువారం వసంత పంచమి సందర్భంగా ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. 50 మంది చిన్నారులతో సరస్వతీ పూజ చేసి, అక్షరాభ్యాసాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్యురాలు డాక్టర్ సులేఖ, పాఠశాల కరెస్పాండెంట్ నర్సింహనాయుడు, హెచ్ఎం కె.వి.డి.మాధురి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దయాల్‌బాగ్ కాలనీలో..

విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో కాలనీవాసులు గురువారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీతో పాటు దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌ను విద్యుద్దీపాలతోను, వీధులను రంగవల్లులతో అలంకరించారు. ఈ కాలనీకి సౌరశక్తి ఆధారిత విద్యుత్ దీపాలు వినియోగించడం విశేషం. ఉదయం నుంచి కాలనీ ఆవరణలో ఉన్న రాధా స్వామి మందిరంలో ప్రార్థనలు చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, సభ్యులు ప్రకాష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తప్పనిసరి'


సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని, అటువంటి వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు 663వ రోజుకు చేరుకున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ఉపాధి కల్పనలో ఎంతో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తామని ప్రధాని మోదీ ప్రభుత్వం బరితెగించి ప్రకటనలు చేస్తుంటే.. బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ఏమాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో కన్వీనర్ పి.మణి, నాయకులు పద్మ, మేరీ, మంగశ్రీ, రత్నం, ముత్యాలమ్మ, సీఐటీయూ నాయకులు కుమార్ మంగళం, జగన్, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

త్రివిధ దళాలకు ఏయూ సేవలు అమోఘం

ఏయూ క్యాంపస్: దేశ రక్షణ రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల ఉన్నత విద్య కలలు సాకారం చేసుకునే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయ అందిస్తున్న సహకారం అమోఘమని భారత రక్షణ మంత్రిత్వ శాఖ డీజీఆర్ విభాగం డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ శరద్‌కపూర్ అన్నారు. గురువారం ఏయూలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శరద్‌కపూర్ మాట్లాడుతూ త్రివిధ దళాలలో పనిచేసి పదవీ విరమణ చేసే ఉద్యోగులకు నూతన భవిష్యత్తును అందించే దిశగా ఏయూ కృషి చేస్తుందన్నారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణ త్రికరణ శుద్ధిగా చేపడుతూ దేశభక్తితో ముందుకు సాగాలన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, డీజీ శరద్‌కపూర్

అందరికీ నాణ్యమైన ఉన్నత విద్యను అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారం, తోడ్పాటును అందిస్తున్నారన్నారు. వేడుకల్లో భాగంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, త్రివిధ దళాల ఉద్యోగుల గౌరవ వందనాన్ని వీసీ ప్రసాదరెడ్డి, అతిథి శరద్‌కపూర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

• ముందుగా ఉదయం మేజర్ జనరల్ శరద్‌కపూర్ ఏయూ వీసీతో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ రంగాల ఉద్యోగుల కోసం ఏయూ నిర్వహిస్తున్న కోర్సులు, అవగాహన ఒప్పందాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్‌స్టీఫెన్, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, డాక్టర్ ఉజ్వల్‌కుమార్ ఘటక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు


ప్రశంసా పత్రాలతో వీఎంఆర్‌డీఏ ఉద్యోగులు


మహారాణిపేట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభించింది. గురువారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవంలో భాగంగా పలువురు వీఎంఆర్‌డీఏ ఉద్యోగులు కలెక్టర్ మల్లికార్జున చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఎం.శ్రీనివాసరాజు(డీఈఈ), బి.శ్రీరామమూర్తి(డ్రాఫ్ట్‌మేన్), ఎం.రాజేష్, డి.రామనాయుడు, ఎ.నీరాజ, బి.శ్యామల, వి.స్నేహ, జి.వి.రమణరావు, పి.వి.కృష్ణారెడ్డి, పి.లక్ష్మణరావు, ఎస్.తేజశ్వరస్వామి, యు.రాము, తదితరులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

• వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, అధికారులు కూడా గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మల్లికార్జున నుంచి వారు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. బి.నాగేశ్వరరావు(జిల్లా మీడియా విస్తరణ అధికారి), డాక్టర్ ఎస్.ఎఫ్.రవీంద్ర,(పీహెచ్‌సీ, దేవాడ), బి.రమేష్‌కుమార్(ఏవో), నారాయణరావు, ఎం.రత్నకుమారి, ప్రసన్న వర్ధిణి, నజ్మ, ఆశ, సాయికుమార్, తదితరులు ప్రశంసా పత్రాలు పొందారు.


కలెక్టర్ నుంచి అందుకున్న ప్రశంసా పత్రాలతో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు

శ్రీరాములుకు 'రంగ స్థల కళాబంధు' బిరుదు

సీతంపేట: శ్రీమాతా కళా పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల నటుడు బడే శ్రీరాములు నాయుడుకు 'రంగ స్థల కళాబంధు' బిరుదు ప్రదానం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య చేతుల మీదుగా ఈ బిరుదు అందజేశారు. ఈ సందర్భంగా వారణాశి సన్నివేశం నుంచి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. బడే శ్రీరాములునాయుడు హరిశ్చంద్రునిగా, కె.వి.పద్మావతి చంద్రమతిగా, కందుల గున్నేశ్వరరావు నక్షత్రకునిగా, బగాది విజయసాయి కాలకౌశిక, టి.దాలినాయుడు వీరబాహుగా నటించి మెప్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాతా కళాపీఠం గౌరవ సలహాదారు వెంకన్న చౌదరి, బిన్నాల నరసింహమూర్తి, పల్లి నాగభూషణరావు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, కురిటి సత్యంనాయుడు, నంది అవార్డు గ్రహీత మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.


శ్రీరాములుకు బిరుదు ప్రదానం చేస్తున్న వి.వి.రమణమూర్తి, నల్లనయ్య